

నీలి మేఘానికి ఆకుపచ్చ తివాచీ పరిచినట్టున్న ఈ దృశ్యం కోహీర్ మండలం దిగ్వాల్ గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం కనిపించింది. చిరుజల్లులు కురుస్తున్న వేళ 65వ నంబర్ జాతీయ రహదారిపై ఆకాశం మేఘావృతమైన సమయంలో కనిపించిన ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్ మనిపించింది.

-కోహీర్, జూన్ 23

నీలి మేఘానికి.. ఆకుపచ్చ తివాచీ



విద్యుత్ అధికారుల బస్తీబాట

మొబైల్ యాప్ ద్వారా 11 కేవీ ఫీడర్ల సమగ్ర సర్వే

ప్రయోగాత్మకంగా మెదక్ పట్టణంలో ప్రారంభమైన ప్రక్రియ



మెదక్ పట్టణంలో సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న ఎస్ఈ జానకిరాములు

మెదక్ అర్బన్, జూన్ 23: తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ 11 కేవీ ఫీడర్ల సమగ్ర సర్వేకు శ్రీకారం చుట్టింది. ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్ ద్వారా ఫీడర్లు, ప్రతీ స్తంభం పూర్తి వివరాలను నమోదు చేస్తారు. సంస్థ ఆదేశాలతో ఆదివారం మెదక్ పట్టణంలో సర్వేను ప్రయోగత్మకంగా ప్రారంభించినట్లు టీజీఎస్పీడీసీఎల్ ఎస్ఈ జానకీరాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు, పరికరాలు ఇలా ప్రతిదీ ఏ దశలో ఉంది? ఎలా పనిచేస్తుందనే వివరాలను యాప్ ద్వారా రికార్డు చేస్తామని తెలిపారు. సర్వే కోసం మూడు బృందాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. మొదటి దశలో 10 ఫీడర్ల పరిధిలోని విద్యుత్ లైన్లతోపాటు అన్ని అంశాలపై యాప్ ద్వారా చేసి జీపీఎస్‌తో అనుసంధానం చేస్తామన్నారు. యాప్ ద్వారా పూర్తి సమాచారం చేతిలో ఉండడంతో ఎక్కడైనా సమస్య వస్తే పరిష్కరించడం సులువు అవుతుంది. సమస్యకు తగినట్టు ప్రణాళికలు రూపొందించుకుని త్వరగా పరిష్కరించేందుకు యాప్ దోహదపడుతుందని ఎస్ఈ అన్నారు.



మార్కెట్‌కు

లక్ష టన్నులు!

కేంద్రాలకు మూడొంతులే

- మెదక్ జిల్లాలో నెరవేరని ధాన్యం సేకరణ లక్ష్యం
- అంచనా 4,20,200 మెట్రిక్ టన్నులు
- కొనుగోలు చేసింది 2,84,849 టన్నులు
- మిగిలింది మిల్లులు, దళారులకు విక్రయం

మెదక్, జూన్ 23: యాసంగి సీజన్‌లో ధాన్యం సేకరణ లక్ష్యం నెరవేరలేదు. పౌర సరఫరాలశాఖ అంచనాలు తారుమారయ్యాయి. మెదక్ జిల్లాలో లక్ష టన్నుల ధాన్యం రైస్‌మిల్లర్లు, దళారులకు విక్రయించినట్టు తెలుస్తున్నది. సన్న రకాలకు డిమాండ్ అధికంగా ఉండడం, ప్రతికూల వాతావరణ పరిస్థితులతో దిగుబడి తగ్గడంతోనే లక్ష్యం మేరకు సేకరణ సాధ్యం కాలేదని భావిస్తున్నారు. మెదక్ జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో 4,20,200 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ ధాన్యాన్ని సేకరించడానికి జిల్లావ్యాప్తంగా 410 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండు నెలల పాటు కేంద్రాలను తెరిచి ఉంచినా 2,84,849 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. ఈసారి జిల్లాలో సన్న రకాలే అధికంగా సాగు చేశారు. వెల్దుర్తి, తూప్రాన్, నర్సాపూర్, శివ్వంపేట రామాయంపేట, మెదక్, హవేళీఘనపూర్ తదితర మండలాల రైతులు సన్న వడ్లను హైదరాబాద్, నల్గొండ, తమిళనాడు, కర్ణాటక వ్యాపారులకు విక్రయించారు. మిగిలినచోట్ల కూడా దళారులు, మిల్లర్లకు ధాన్యాన్ని అమ్ముకున్నారు.

మద్దతుధర కంటే ఎక్కువ

ప్రభుత్వం నిర్ణయించిన మద్దతుధర కంటే వ్యాపారులు అధిక ధర చెల్లించడంతోనే రైతులు ధాన్యాన్ని విక్రయించడానికి మొగ్గుచూపారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కనీస మద్దతు దర రూ.2,200 చెల్లించారు. అదనంగా హమాలీ చార్జీలను రైతులే భరించాల్సి వచ్చింది. ఇటీవల బ్రాండెడ్ రైస్ కంపెనీలు ఇబ్బడి ముబ్బడిగా పుట్టుకొచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నాయి. తమిళనాట పేరొందిన ప్రముఖ బ్రాండెడ్ కంపెనీ ప్రతినిధులు జిల్లాలో రైతుల వద్ద నుంచి అధిక ధరలకు ధాన్యాన్ని కొనుగోలు చేశాయని సమాచారం. ఇక రైస్ మిల్లర్లు, ప్రవేటు వ్యాపారులు హమాలీ ఛార్జీలు తామే భరించడానికి సిద్ధమై అప్పటికప్పుడే డబ్బు చెల్లించడంతో రైతులు ప్రవేటు వ్యాపారులకు అమ్ముకున్నారు.

సన్నరకం 70 వేల మెట్రిక్ టన్నులు

ఈసారి జిల్లాలో రైతులు సన్నరకం సాగుకే మొగ్గు చూపారు. మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉండడమే ఇందుకు కారణం. సుమారు 70 వేల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని రైతులు బహిరంగ మార్కెట్‌లో విక్రయించారని అధికారులు చెబుతున్నారు. ధాన్యం సేకరణ ముగిసే నాటికి 1,35,351 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయలేకపోయామని పౌరసరఫరాలశాఖ అధికారులు తెలిపారు.

లక్ష్యం చేరుకోలేదు



యాసంగి సీజన్‌లో ధాన్యం సేకరణ లక్ష్యం నెరవేరలేక పోవడానికి కారణాలు విశ్లేషిస్తున్నాం. పంట దిగుబడులు తగ్గి పోవడమే కాకండా ప్రవేటు వ్యాపారులు ధర అధికంగా చెల్లించడంతో కొనుగోళ్లు తగ్గి ఉంటాయి. పైగా సన్నరకం పంట వేయడం పట్ల రైతులు ఆసక్తి చూపుతుండడం కూడా ప్రధాన కారణం.

-హరికృష్ణ, పౌరసరఫరాలశాఖ, డీఎం మెదక్

ధాన్యం కొనుగోలు కేంద్రాలు	410
సేకరణ లక్ష్యం	4,20,200 మె.ట.
కొనుగోలు చేసింది	2,84,849 మె.ట.
రైతులకు చెల్లించింది	రూ. 627.52 కోట్లు





పల్లెవెలుగులో మెదక్ కలెక్టర్

జిల్లాకే బాస్ అయిన ఆ కలెక్టర్ ఆర్భాటాలు వదిలేసి, కనీసం సిబ్బంది కూడా వెంట లేకుండా సాధారణ ప్రయాణికుడిలా కుటుంబంతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఆయనే మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్. ఆయన ఆదివారం తన కుటుంబీకులతో కలిసి మెదక్ నుంచి జేబీఎస్ వెళ్లే ఆర్డినరీ బస్సులో ఎక్కారు. కలెక్టర్ అనే విషయం ఎవరికీ తెలియనీయకుండా నిరాడంబరంగా నర్సాపూర్ వరకు ప్రయాణించారు. అక్కడ బస్సు దిగి కారులో వెళ్లిపోయారు.

-నర్సాపూర్, జూన్ 23

రైట్.. రైట్

అధికారులతో చర్చలు సఫలం

- మెదక్ డిపో డ్రైవర్ల ఆందోళన విరమణ
- తెల్లవారుజాము నుంచి విధుల్లోకి



చర్చలు జరుపుతున్న ఆర్టీసీ డ్రైవర్లు, అధికారులు

మెదక్ అర్బన్, జూన్ 23: అధికారులతో జరిపిన చర్చలు సఫలం కావడంతో మెదక్ ఆర్టీసీ డిపో డ్రైవర్లు ఆందోళన విరమించారు. అధికారుల వేధింపులు మానుకొని, పనిభారం తగ్గించాలని మూడు రోజులగా డ్రైవర్లు విధులను బహిష్కరించి నిరసనకు దిగారు. మూడు రోజులుగా చర్చలు కొలిక్కి రాలేదు. దీంతో డ్రైవర్లు నిరసనను కొనసాగించారు. డ్రైవర్ల సమస్యలను ఈడీ పురుషోత్తం ఆర్ఎం దృష్టికి తీసుకెళ్లారు. డ్రైవర్ల తరఫున ఎస్‌డబ్ల్యూయూఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ హనుమంతు ఆదివారం సాయంత్రం డిప్యూటీ ఆర్ఎం దైవాదీనం, డిపో మేనేజర్‌తో సుదీర్ఘంగా చర్చించారు. సమస్యలను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో తెల్లవారుజాము నుంచే ఆర్టీసీ డ్రైవర్లు విధుల్లోకి చేరనున్నారు.



38 మంది ఎస్జీటీలకు

పదోన్నతి

- ప్రభుత్వ యాజమాన్య పరిధిలో ముగిసిన పదోన్నతులు
- జడ్పీ ఎస్ఏ టీచర్ల బదిలీ ఉత్తర్వులు ఆలస్యం!

సంగారెడ్డి అర్బన్, జూన్ 23 : ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతున్నది. ఇందులో భాగంగా ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)లకు స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ)లుగా పదోన్నతి లభించింది. జిల్లాలో 38 మందికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందారు. వీరు సోమవారం పదోన్నతి పొందిన పాఠశాలకు వెళ్లి రిపోర్టు చేయాల్సి ఉంటుంది. జడ్పీ యాజమాన్య పరిధిలోని(మల్టిజోన్-2) స్కూల్ అసిస్టెంట్ టీచర్ల బదిలీలకు సంబంధించి స్పౌజ్ వెరిఫికేషన్ జరుగుతున్న నేపథ్యంలో వీరి బదిలీ ఉత్తర్వులు కూడా సోమవారం వెలువడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.



సంగారెడ్డి ఎంసీహెచ్‌లో తెరుచుకోని తల్లిపాల నిల్వ కేంద్రం

తల్లి పాల నిల్వ కేంద్రం

ప్రారంభానికి గ్రహణం

- ఎంసీహెచ్‌లో ప్రారంభానికి నోచుకోని మదర్ మిల్క్ బ్యాంకు
- పనులు పూర్తై ఏడాది గడిచినా అందుబాటులోకి రాని వైనం
- నవజాత శిశువులకు భరోసా కలేనా?

సంగారెడ్డి అర్బన్, జూన్ 23 : సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన తల్లి పాల నిల్వ కేంద్రం(ల్యాక్టేషన్ మేనేజ్‌మెంట్ యూనిట్) ప్రారంభానికి గ్రహణం పట్టింది. పనులు పూర్తయి, వైద్య పరికరాలు ఏర్పాటు చేసి ఏడాది గడుస్తున్నా ఇప్పటికి ప్రారంభానికి నోచుకోవడం లేదు. మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లోని మొదటి అంతస్తులో మదర్ మిల్క్ బ్యాంకును ఏర్పాటు చేశారు. రూ.3 లక్షల నిధులతో ఫర్నీచర్ పార్టీషన్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ తదితర ఆధునీకరణ పనులు పూర్తిచేశారు. రూ.9.59 లక్షల నిధులతో తల్లి పాల నిల్వకు సంబంధించిన పరికరాలు సమకూర్చారు. టీఎస్ఎంఎస్ఐడీసీ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో పనులు చేపట్టగా, ప్రారంభోత్సవానికి మాత్రం జిల్లా యంత్రాంగం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తున్నది.

ఆరోగ్య మంత్రి దృష్టిసారించేనా?

అత్యవసర పరిస్థితులలో తల్లి పాల కొరతను తీర్చేందుకు గత ప్రభుత్వం తల్లిపాల బ్యాంకు ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే తల్లీ, బిడ్డల క్షేమం కోసం ఎంసీహెచ్ కిట్, న్యూట్రిషన్ కిట్, అమ్మఒడి వంటి పథకాలను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే నవజాత శిశువులకు పాల సమస్యను దూరం చేసేందుకు తల్లిపాల నిల్వ కేంద్రం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. సాధారణంగా తల్లుల్లో జన్యుపరమైన లోపాలు, ఒత్తిడి, వయస్సు ఎక్కువగా ఉన్నవారికి తల్లిపాలు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. బరువు తక్కువగా పుట్టిన శిశువులు, నెలలు నిండకుండా జన్మించిన పిల్లలకు, తల్లి పాలు అందని శిశువులకు వీటిని ఉపయోగిస్తారు. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న తల్లిపాల బ్యాంకుతో నవజాత శిశువులకు మరింత భరోసా దక్కనుంది. పటాన్‌చెరు, సదాశివపేట, జహీరాబాద్, జోగిపేట, నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ఎంసీహెచ్‌లో ప్రసవమైన తల్లుల నుంచి వారి సమ్మతితోనే పాలను సేకరిస్తారు. శిశువు చనిపోయిన బాలింతలు, స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన తల్లుల నుంచి పాలను సేకరించి వాటిని తల్లిపాల బ్యాంకులో భద్రపరుస్తారు. ఆధునిక సాంకేతిక ఆధారంగా ప్రమాణాలను పాటిస్తూ శుద్ధి చేసి, నిల్వ చేసిన తల్లిపాలను అవసరమైన శిశువులకు అందిస్తారు. ఆరోగ్య సమస్యలతో పుట్టిన శిశువులు, తల్లి వద్ద పాలు సరిపోని చిన్నారులకు ఈ బ్యాంకుతో ఎంతో ప్రయోజనం కలుగనుంది. ఇక్కడ ఉచితంగానే తల్లి పాలు పొందే అవకాశం ఉంటుంది. ఇంత ప్రయోజనకరమైన తల్లి పాల నిల్వ కేంద్రం ప్రారంభానికి ఎదురుచూపులు తప్పడం లేదు. జిల్లాకు చెందిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి చొరవ తీసుకుని కేంద్రాన్ని తెరిపించాలని పలువురు కోరుతున్నారు.



పొలంలో బయటపడిన విగ్రహం

పొలం చదును చేస్తుండగా వేంకటేశ్వరుడి

పంచలోహ విగ్రహం లభ్యం

నారాయణఖేడ్, జూన్ 23: పొలాన్ని చదును చేస్తుండగా భూమిలో నుంచి వేంకటేశ్వరస్వామి పంచలోహ విగ్రహం బయల్పడింది. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండల పరిధిలోని హన్మంత్‌రావు పేటకు చెందిన అనిశెట్టి రాజు, సంగమేశ్వర్ గ్రామ శివారులోని తమ పొలాన్ని ఆదివారం ఉదయం ఎక్స్‌కవేటర్‌తో చదును చేయిస్తున్నారు. మట్టిని తీస్తుండగా ఖంగుమని శబ్ధం రావడంతో అక్కడ చూడగా దగా వేంకటేశ్వర స్వామి పంచలోహ విగ్రహం బయటపడింది. విగ్రహం అడుగు ఎత్తు, రెండు నుంచి రెండున్నర కిలోల బరువు ఉన్నది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని చారిత్రాత్మకమైన వేంకటేశ్వర ఆలయానికి విగ్రహాన్ని తరలించారు.



ఆలయానికి చేర్చిన విగ్రహం



ఆనెగూడెంలో గొడవ పడుతున్న ఇరువర్గాలు

ఆలయ స్థలం విషయంలో ఇరువర్గాల ఘర్షణ

వెల్దుర్తి, జూన్ 23: ఆలయ స్థలం విషయంలో ఇరువర్గాలు గొడవపడి ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న సంఘటన మండలంలోని ఆరెగూడెం గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామంలోని గడిమైసమ్మ ఆలయాన్ని గ్రామస్థులు సుమారు ఏడేళ్ల క్రితం నిర్మించి అక్కడే జాతర సమయాల్లో పూజలు నిర్వహించారు. గుడి పక్కన స్థలాన్ని గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి అనే వ్యక్తి వద్ద గ్రామానికే చెందిన కొడె మాధవి సుమారు ఏడాది క్రితం కొనుగోలు చేసింది. ఆ స్థలంలో ఇటీవల ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించగా.. గ్రామానికే చెందిన గోవింద్‌రెడ్డి, పనివారు అభ్యంతరం తెలిపారు. ఈ విషయంలో ఇరువురి మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతుంది. పాత స్థలంలోనే ఆలయాన్ని పునర్నిర్మించాలని గోవింద్‌రెడ్డి వర్గీయులు పట్టుబడుతుండగా తాము కొనుగోలు చేసిన స్థలంలో ఇంటి నిర్మాణం చేపడుతుంటే ఎందుకు అభ్యంతరం తెలుపుతున్నారంటూ కొడె మాధవి కుటుంబసభ్యులు వాపోతున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఆలయ స్థలం విషయంలో మరోసారి గొడవ జరగగా ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు.



ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

మెదక్ సీఎస్ఐలో భక్తుల సందడి

మెదక్ కల్చరల్, జూన్ 23: మెదక్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం సందడి నెలకొన్నది. ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయమే శిలువ ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతిష్ఠించిన అనంతరం ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య భక్తులకు దైవ సందేశాన్ని చదివి వినిపించారు. భక్తులు కుటుంబసభ్యులతో కలిసి విందు భోజనాలు చేస్తూ చెట్ల కింద సేద తీరారు.

రామాయంపేటలో సైక్లింగ్ పోటీలు



రామాయంపేటలో సైక్లింగ్ పోటీల్లో క్రీడాకారులు

రామాయంపేట, జూన్ 23: అంతర్జాతీయ ఒలంపిక్ దినోత్సవం సందర్భంగా రామాయంపేటలో సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. ఆదివారం స్థానిక కళాశాల వద్ద మొదలైన సైక్లింగ్ ఎస్సీ కాలనీ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నది. ఖేల్ ఇండియా సైక్లింగ్ అకాడమి నిర్వహణలో జరిగిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు ప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయన్నారు.

వర్షాల కోసం భూలక్ష్మమ్మ ఆలయంలో పూజలు



తుర్కపల్లికి కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న రైతులు, మహిళలు

నారాయణఖేడ్, జూన్ 23: వర్షాలు కురియాలంటూ మనూరు మండలం ఎల్గోయి, అతిమ్యాల్‌గ్రామానికి చెందిన రైతులు ఆదివారం ఆయా గ్రామాల నుంచి తలలపై కలశాలు, తులసీ కోటలతో పాదయాత్ర చేస్తూ నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి శివారులోని భూలక్ష్మమ్మ ఆలయాన్ని దర్శించుకుని పూజలు చేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా వర్షాలు సక్రమంగా కురిసి, పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. కాగా జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యుడు నగేష్ షెట్కార్ సైతం ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివకుమార్, బుచ్చిరెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, అశ్వాక్‌పటేల్ పాల్గొన్నారు.

జోరుగా కలప అక్రమ రవాణా



కలపను తరలిస్తున్న దృశ్యం(ఫైల్)

రేగోడు జూన్ 23: రేగోడులో కలప అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. వాల్టా చట్టాన్ని అమలుచేయాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వదిలేయడంతో ఈ అక్రమ రవాణా రోజురోజుకూ పెరుగుతున్నది. ప్రభుత్వం ఓ పక్క మొక్కలు నాటాలని, సంరక్షించాలని ప్రకటిస్తుంటే.. మరోపక్క కలప వ్యాపారులు చెట్లను యథేచ్ఛగా నరుకుతున్నారు. ఇదిలా ఉండగా చెట్లను నరికేందుకు, కలప రవాణాకు ఫారెస్ట్ అధికారులే అనుమతులు ఇస్తున్నారని ప్రచారం కూడా ఉన్నది. ఒక్క అనుమతితో 10 లారీల కలపను అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అధికారులు స్పందించి కలప అక్రమ రవాణా, చెట్ల నరికివేతను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

హత్నూర, జూన్ 23: విద్యుదాఘాతంతో గేదె మృతిచెందిన సంఘటన హత్నూర మండలం లింగాపూర్ గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన రైతు నర్సింహులు తన పశువులను మేత కోసం గ్రామ శివారులోకి తోలుకెళ్లాడు. అయితే లూజ్ వైర్ల కారణంగా గేదెకు విద్యుత్ వైర్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు తెలిపారు.

27న స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, జూన్ 23: తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లలో నాల్గవ తరగతిలో ప్రవేశాల కోసం ఈ నెల 27న బాల, బాలికలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి రాంచందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో ఎంపికలు నిర్వహించనున్నామని, ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు. 01.09.2015 నుంచి 31.08.2016 మధ్య పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన 20 మంది బాలురు, 20 మంది బాలికలకు హకీంపేటలోని క్రీడా పాఠశాలలో రాష్ట్రస్థాయి ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. జూలై 10, 11వ తేదీల్లో రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు జరుగుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు 9000491112 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రేమించిన వ్యక్తి పెళ్లికి నిరాకరించాడని యువతి ఆత్మహత్య


హరిత(ఫైల్)

వర్గల్, జూన్ 23: ప్రేమించిన వ్యక్తి పెళ్లికి నిరాకరించాడని యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకున్నది. ఎస్ఐ భువనేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం దండుపల్లి గ్రామానికి చెందిన కాస రమేశ్‌కు భార్య ముత్యాలు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. చిన్న కూతురైన హరిత(17) గజ్వేల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నది. కాగా గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్ గ్రామానికి చెందిన బోయిని స్వామి అనే వ్యక్తిని ప్రేమించింది. పెళ్లి చేసుకోమని అడగడంతో అతను నిరాకరించాడని హరిత తన తల్లికి తెలిపింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆదివారం ఉదయం కుటుంబసభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా.. ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

నీట మునిగి యువకుడి మృతి


మహ్మద్ ఫిరోజ్ (ఫైల్)

పాపన్నపేట, జూన్ 23: ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన ఏడుపాయల ఆలయ సమీపంలోని వనదుర్గా ప్రాజెక్టులో ఆదివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ సంగన్న వివరాల ప్రకారం.. హైదరాబాద్ చింతల్‌కు చెందిన మహ్మద్ ఫిరోజ్(21) శనివారం సాయంత్రం స్నేహితులతో కలిసి సరదాగా ఏడుపాయలకు వచ్చారు. రాత్రి అక్కడే ఉన్నారు. ఆదివారం మధ్యాహ్న సమయంలో ఆలయ సమీపంలోని వనదుర్గా ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. అందరూ కలిసి స్నానం చేస్తుండగా ఫిరోజ్ ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. స్నేహితులు వెంటనే పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని వెలికితీసి, మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి యూసుఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

కారు అడ్డు తీయమన్నందుకు వ్యక్తిపై దాడి

● పరారీలో నిందితులు ● పోలీసుల గాలింపు


విజయ్‌కి చికిత్స అందిస్తున్న వైద్యులు

మునిపల్లి, జూన్ 23: సెల్ఫీ దిగుతూ రోడ్డుకు అడ్డంగా నిలిపిన కారును తీయమన్నందుకు ఓ వ్యక్తిపై దాడిచేసిన సంఘటన కంకోల్ టోల్‌ప్లాజా వద్ద ఆదివారం జరిగింది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కంకోల్ గ్రామానికి చెందిన పటోళ్ల విజయ్ తన స్నేహితుడైన భాస్కర్‌రెడ్డితో కలిసి సంగారెడ్డి వైపు నుంచి స్వగ్రామమైన కంకోల్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో టోల్‌ప్లాజా వద్దకు రాగానే గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డుపై కారు నిలిపి సెల్ఫీ దిగుతున్నారు. కారును పక్కకు జరపండి అంటూ విజయ్ చెప్పడంతో మాటామాట పెరిగి గొడవకు దారిసింది. దీంతో కోపంతో ఉన్న సదరు కారుకు సంబంధించిన వ్యక్తులు రాడ్డుతో విజయ్‌పై దాడిచేశారు. అంతటితో ఆగకుండా కత్తితో మరోసారి దాడికి పాల్పడ్డారు. దీంతో విజయ్ తల, చెవి, చెంపపై తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని సదాశివపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన నిందితులు పరారుకావడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. విజయ్ తండ్రి నాగిశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

గంజాయి పట్టివేత


పోలీసుల అదుపులో గంజాయి తరలిస్తున్న వ్యక్తి

మునిపల్లి, జూన్ 23: అక్రమంగా తరలిస్తున్న 300 గ్రాముల ఎండు గంజాయిని మునిపల్లి మండలంలోని కంకోల్ టోల్‌ప్లాజా వద్ద ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు గంజాయిని తరలిస్తున్నారన్న సమాచారంతో 165వ జాతీయ రహదారిపై ఉన్న టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా జహీరాబాద్‌కు చెందిన ఎండీ.మోహిజ్‌కు చెందిన (టీఎస్ 07 ఎఫ్ఎల్ 5223) నెంబరు గల ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేయగా.. అందులో 300 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైనట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. పట్టుబడిన ఎండు గంజాయితో పాటు బైక్‌ను సీజ్ చేశారు. గంజాయి విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని తెలిపారు. అనంతరం సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్‌శాఖ అధికారులు తెలిపారు. ఈ తనిఖీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సీహెచ్.చంద్రశేఖర్, ఎస్ఐ యాదయ్య, హెడ్ కానిస్టేబుల్ ఎండీ.అలీం, అంజ హుస్సేన్, కానిస్టేబుల్స్ సతీష్, రామారావు, గోపాల్ పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ ఉద్యోగుల గలాట

● పాలనా వ్యవహార ఫిర్యాదులు, విభేదాలు తదితర అంశాలపై అంతరంగిక చర్చలో వాగ్వాదం
● పరస్పరం కుర్చీలతో దాడి చేసుకునే యత్నం


కొమురవెల్లి ఆలయ గోపురం

చేర్యాల, జూన్ 23: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ ఉద్యోగులు కొట్లాడుకున్నారు. ఎవరికి వారుగా తప్పులను ఎత్తిచూపుకుంటూ పరస్పర దూషణలకు దిగి చేయిచేసుకున్నారు. కుర్చీలతో పోట్లాడుకోబోయారు. కొన్నాళ్లుగా ద్వితీయ శ్రేణి అధికారులు, ఉద్యోగుల మధ్య కొనసాగుతున్న వైరాలు ఆదివారం మరోమారు బహిర్గతమవడం కలకలం రేపింది. ఈ మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్లన్న ఆలయ పాలన, వ్యవహారాల విషయాలతో పాటు టెండర్ల నిర్వహణ, ఇతరత్రా అంశాలు కొన్నాళ్లుగా వివాదాస్పదమవుతున్నాయి. అనర్హులైనా నచ్చినవారికి అందలమెక్కించి అర్హత కలిగిన వారికి విభాగాల బాధ్యతలు అప్పగించకపోవడం, పలువురిపైన చిన్నచూపు వహిస్తూ, ఓ వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తుండటంతో ద్వితీయశ్రేణి అధికారులు, ఉద్యోగులు, తాత్కాలిక సిబ్బంది, ఆలయవర్గాల మధ్య విబేధాలు తలెత్తుతున్నాయి. అంతేకాకుండా పలువురు దశాబ్దాల కాలంగా ఇక్కడే తిష్టవేసి పనిచేస్తుండటంతో జవాబుదారీ తనంతో వ్యవహరించడం లేదు. అయా అంశాల దృష్ట్యా ఆలయంలో నెలకొన్న లోటుపాట్లు, జరుగుతు న్న పొరపాట్లపై ఇతరుల పేరిట కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదులు చేసుకుంటున్నారు. సరిదిద్దేవారు లేకపోగా, ప్రక్షాళన చర్యలు చేపట్టకపోతుండటంతో 'ఆడింది ఆట, పాడింది పాట'గా తయారైంది. ఈ క్రమంలో ఈవోను ఏసీబీకి పట్టించేందుకు ప్లాన్ వేశానని ఓ ఉద్యోగి ఇటీవల సిబ్బందితో పాటు పలువురితో పేర్కొనడం, ఇతరత్రా ద్వితీయశ్రేణి అధికారులు విధులకు సక్రమంగా రాకపోవడం, వసతి గదులను బసకు వినియో గించుకుంటూ తమపై పెత్తనం చెలాయిస్తున్నందున సంగతి చూస్తామని చెప్పడం ఆ నోటా ఈనోటా బయటకు పొక్కింది. ఆయా పరిణామాలతో పాటు కమిషనర్ కార్యాలయాల్లో ఫిర్యాదులు, ఇతరత్రా అంశాలు ఆలయ ప్రతిష్టకు భంగం కలుగుతుండటంతో ఈవో బాలాజీశర్మ తన కార్యాలయంలో ఆదివారం ఉదయం ఏఈవో గంగా శ్రీనివాస్, ఎలక్ట్రికల్ విభాగం ఏఈ బి.అంజయ్య ఇతరత్రా ఉద్యోగులు, తదితరులతో చర్చించిసాగారు. అంతర్గత విషయాలను బయటకు ఉప్పందించకూడదని, ఫిర్యాదులు చేసుకోకుండా ఎవరి విధులు వారు సక్రమంగా నిర్వర్తించాలంటూ ఈవో సూచించారు. ఈ క్రమంలో ఏఈవో గంగా శ్రీనివాస్, ఏఈ బి.అంజయ్య మధ్య మాటామాటా పెరిగిచేయి చేసుకునేందుకు ఉపక్రమించి తోపులాడుకున్నారు. ఒకరిపై మరొకరు తూలనాడుకుని కుర్చీలు విసరడానికి పైకి ఎత్తి గలాటాకు దిగారు. అక్కడ ఉన్న ప్లంబర్ విజయ్ కూడా కలగజేసుకున్నాడు. ఒకరిపై మరొకరు చెంపపై కొట్టుకున్నారు. పరిస్థితి జేజారిపోవడాన్ని గమనించి ఈవో అడ్డుపడి మందలించారు. చివరకు గొడవ సద్దుమణగడంతో బయటకు వెళ్లిపోయారు. అనంతరం ఎవరికి వారుగా భిన్నాభిప్రాయాలు వ్యక్తపరచడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఎన్నడూలేని విధంగా ఈవో సమక్షంలో ఆలయాధికారులు గలాటపడడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ విషయమై దేవాదాయశాఖ ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

నాపైనే కుర్చీ ఎత్తాడు

ఆలయ పాలన విషయాలపై ఈవో బాలాజీ అడిగిన ప్రశ్నలకు ఏఈ అంజయ్య నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. నాపట్ల కూడా నిర్లక్ష్యంగా మాట్లాడాడు. అకారణంగా అతడే నాపై కుర్చీ ఎత్తాడు. నేను అతడిపై చేయిచేసుకోలేదు. తప్పు చేయనప్పుడు నేనేందుకు క్షమాపణ చెబుతాను.

– గంగా శ్రీనివాస్, ఏఈవో

ఏఈవో, ప్లంబర్ చెంపపై కొట్టారు

రూ.500క్యూలైన్ టికెట్లు జారీచేస్తున్న నన్ను ఈవో కార్యాలయానికి రావాలనడంతో వెళ్లాను. నేను ఏమీ మాట్లాడకముందే అక్కడున్న ఏఈవో గంగా శ్రీనివాస్ నా చెంపపై కొట్టాడు. తర్వాత ప్లంబర్ సార్ల విజయ్ కూడా చెంపపై కొట్టాడు. చివరకు ఈవో మందలించడంతో క్షమాపణ చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంపై ఆలోచిస్తున్నాను.

– ఏఈ అంజయ, ఎలక్ట్రికల్


మల్లన్నస్వామివారి నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు


కొండపోచమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ

చేర్యాల, జూన్ 23: కొమరవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ సందర్శనార్థం ఆదివారం వేలాదిమంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. సంప్రదాయబద్ధంగా మట్టికుండలో బోనంచేసి భక్తిప్రపత్తులతో చలక, నజరు, ముఖ మండప పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లంపానకం సాక పెట్టి ఒడిబియ్యాలు పోశారు. ప్రత్యేక, ఉచిత దర్శనం క్యూలైన్లల్లో రద్దీ కొనసాగడంతో స్వామివారి దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భక్తులతో నాచగిరి క్షేత్రం కిటకిట

వర్గల్, జూన్ 23: రాష్ట్రంలో రెండో యాదాద్రిగా పేరొందిన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలతో పాటు స్వామివారికి నిజాభిషేకాలు, కల్యాణం మొక్కుబడి సేవలను భక్తులు నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ తెలిపారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు.

లక్ష్మీనృసింహస్వామి క్షేత్రానికి 28 గుంటల భూమి, 54 గజాలు ఆర్‌సీసీ బిల్డింగ్ విరాళం

వర్గల్, జూన్ 23: వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రానికి హైదరాబాద్ వాస్తవ్యులు కీర్తిశేషులు త్రిగుల్ల చంద్రశేఖరశర్మ భార్య అరుణ, కుమారులు కృష్ణ చంద్రశర్మ, రఘువీర్‌శర్మ, నందకిషోర్‌శర్మ నాచారంగుట్ట వద్ద సర్వే నెంబర్ 360 హీరాబాయమ్మ తోటలోని 28 గుంటల భూమిని ఆలయానికి విరాళంగా అందజేశారు. రిజిస్ట్రేషన్ పత్రాలు, ధరణి పాస్‌బుక్‌లను ఆలయ కార్యనిర్వహణ అధికారి అన్నపూర్ణకు ఇచ్చారు. అలాగే ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న అర్చకుడు కీర్తిశేషులు త్రిగుల్ల పద్మనాభశర్మ కమారులు గోపాలకృష్ణశర్మ, విద్యాసాగర్‌శర్మ అదే సర్వే నెంబర్‌లోని హీరాబాయమ్మ తోటలోని 54 చదరపు గజాల ఆర్‌సీసీ బిల్డింగ్‌కు సంబంధించిన దాన పత్రాలను అందజేశారు. కాగా ఆలయం నుంచి శంకరమఠంలోని హీరాబాయమ్మ తోట వరకు స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోశ్ఛరణలతో ఆశీర్వచనాలు, స్వామివారి శేషవస్త్రాలు వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు జగన్నాథచార్యులు, వేదపండితులు నాగబాల కామేశ్వరశర్మ, అర్చకులు పాల్గొన్నారు.

కొండపోచమ్మ ఆలయంలో భక్తుల సందడి

జగదేవ్‌పూర్, జూన్ 23: కొండపోచమ్మ ఆలయం వద్ద ఆదివారం భక్తుల సందడి నెలకొంది. కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు కొండపోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. గూడరాల వద్ద బోనం తయారు చేసుకుని డప్పు వాయిద్యాలతో శిగాలుగుతూ అమ్మవారి చెంతకు చేరుకున్నారు.

వనదుర్గామాతకు భక్తుల తాకిడి

పాపన్నపేట, జూన్ 23: ఏడుపాయల వనదుర్గామాత ఆలయం భక్తులతో కిటకిటాలాడింది. ఆదివారం సెలవు కావడంతో ఉమ్మడి జిల్లావాసులతో పాటు నిజామాబాద్, కరీంనగర్, పొరుగు రాష్ట్రాలైనా కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు తరలివచ్చారు. తెల్లవారు జామున 5-30 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మంజీరా నదిపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు.


భూమి పత్రాలను ఈవో అన్నపూర్ణకు అందజేస్తున్న త్రిగుల్ల అరుణ, కుటుంబసభ్యులు


పాపన్నపేట: భక్తులతో కిటకిటలాడుతున్న ఏడుపాయల వనదుర్గామాత ఆలయ ప్రాంగణం

రోడ్ల పక్కనే మద్యం అడ్డాలు!

● నిర్మానుష్యం నుంచి జన సందోహంలోకి..
● ఇబ్బందులు పడుతున్న ప్రజలు


తిమ్మానగర్ వెళ్లే రహదారి పక్కన తాగి పగులగొట్టిన సీసాల గాజు పెంకులు

మెదక్ కల్చరల్, జూన్ 23: ఒకప్పుడు నిర్మానుష్య ప్రాంతంలో ఉండే మందుబాబుల అడ్డాలు.. నేడు రోడ్డు పక్కకు, జనసందోహంలోకి వచ్చాయి. ఇళ్ల మధ్య ప్రభుత్వ కార్యాలయాల పక్క, జన సమూహాలకు దగ్గరగా.. గ్రామాలకు వెళ్లే దారిలో, ప్రభుత్వ పాఠశాలల్లో సిట్టింగ్‌లు వేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. మద్యం సేవించిన అనంతరం సీసాలను పగులగొట్టి రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారు. దీంతో దారిపోయే వారికి గాజు పెంకులు గుచ్చుకుని విలవిలలాడుతున్నారు.

పోలీసుల నుంచి తప్పించుకునేందుకు..

తాగి వాహనాలు నడిపితే శిక్షలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నా.. మందుబాబులు పట్టించుకోవడం లేదు. అయితే పట్టణ పరిసరాల్లో పోలీసుల నిఘా ఎక్కువగా ఉంటుందని భావించి.. కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. గ్రామాలకు వెళ్లేదారుల్లో, అటవీ ప్రాంతంలో సిట్టింగ్ ఏర్పాటు చేసుకుని పార్టీ కానిచ్చేస్తున్నారు. ఒకానొక సమయంలో ఆయా ప్రాంతాల గుండా వెళ్లేవారిపై దాడులకు దిగుతున్న సందర్భాలూ లేకపోలేదు. పోలీస్ అధికారులు స్పందించి రోడ్డు పక్క, గ్రామ శివారుల్లో మద్యంసేవించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

ఓపెన్‌గా మద్యం సేవిస్తే కేసులే

జన సమూహాల్లో కానీ, రోడ్డు పక్కన కానీ, ప్రజలకు ఇబ్బంది కలిగించే చోట మందు బాబులు సిట్టింగ్ వేస్తే కేసులే. వీరిపై ఓపెన్ డ్రింకింగ్ లిక్కర్ ప్రొహిబిషన్ కేసు నమోదు చేస్తాం. కొద్దినెలల నుంచి ఓపెన్‌గా మద్యం సేవిస్తున్న వారిపై 17 కేసులు నమోదు చేశాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్, మెదక్

గటారా టూ డ్రోన్ వరకూ..

● నూతన టెక్నాలజీ వైపు రైతుల చూపు ● ట్రాక్టర్, డ్రోన్లతోనే మందుల పిచికారీ ● మూలనపడ్డ పంపులు



ట్రాక్టర్లతో పత్తిపంటకు పిచికారీ చేస్తున్న దృశ్యం, వరి పంటకు డ్రోన్‌తో పిచికారీ


పెట్రోల్ పంపు, చేతి పంపు


గటారా

మునిపల్లి, జూన్ 23: వ్యవసాయ రంగంలో రోజురోజుకూ ఆధునిక యంత్రాలు రావడంతో పాత పంపులు మూలనపడ్డాయి. టెక్నాలజీ పెరగడంతో పంటలకు కూలీలు అవసరం లేకుండా మందులను పిచికారీ చేస్తున్నారు. ప్రస్తుతం పంటల ఎదుగుదలకు, చీడ పురుగులను తొలగించేందుకు పిచికారీ చేయాల్సిందే. 30 ఏళ్ల క్రితం గరాటా అనే పరికరాన్ని ఎద్దుల బండిపై అమర్చి రైతులు పంటలకు పిచికారీ చేసేవాళ్లు. గటారా తర్వాత చేతిపంపు, పెట్రోల్ (తైవాన్), చార్జింగ్ పంపులతో పత్తి, కంది, వేరుశనగ, జొన్న తదితర పంటలకు పిచికారీ చేసేవాళ్లు. ప్రస్తుతం తైవాన్ పంపులను సైతం పక్కనపెట్టి ట్రాక్టర్లతో పంటలకు (స్ప్రే) పిచికారీ చేస్తున్నారు. టెక్నాలజీ మారిన కొద్దీ ఎన్నో యంత్రాలు వస్తున్నాయి. రైతులకు కష్టం లేకుండా డ్రోన్ల సహాయంతో పంటలకు సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు.

తైవాన్ పంపుల ధరలు పెరగడంతో

పంటలకు పై మందులు పిచికారీ చే యాలన్నా తైవాన్ పంపులు కావాల్సిందే. అయితే 20 ఏళ్ల క్రితం తైవాన్ పంపులను సబ్సిడీ కింద ప్రభుత్వం రైతులకు అందించింది. తైవాన్లకు గిరాకీ పెరగడంతో ధరలు కూడా పెరిగాయి. దీనికి తోడు తైవాన్ పంపుతోనైతే ముగ్గురు కూలీలు నీళ్ల మోసేందుకు అవసరం ఉంటుంది. దీంతో చేసేదేమి లేక ట్రాక్టర్లతో ఎకరాకు రూ.400ల చొప్పున పంటలకు పిచికారీ చేస్తున్నారు.

డ్రోన్లకు భలే డిమాండ్

వరిలో తైవాన్ పంపులతో పిచికారీ చేసేందుకు ఇబ్బందులు ఎందుకని రైతులందరూ డ్రోన్లతో పంటలకు పిచికారీ చేయిస్తున్నారు. దీంతో డ్రోన్లకు భలే డిమాండ్ ఉంది. ఎకరాకు రూ.500 చొప్పున పిచికారీ చేయించుకుంటున్నారు.

తైవాన్ పంపునకు కూలీలు అవసరం

తైవాన్ పంపుతో పంటలకు మందులను పిచికారీ చేసేందుకు ముగ్గురు కూలీలు అవసరం. దీనికితోడు కూలీల రేట్లు కూడా పెరగడంతో డ్రోన్లతో మందులను పిచికారీ చేసుకుంటున్నాం.

– రఘునాథ్‌రెడ్డి, రైతు, గంగోజీపేట, చౌటకూర్

కంది, ధనియాల పంటలకే కొట్టేవాళ్లం

గతంలో గటారా పంపును ఎద్దుల బండికి అమర్చి కంది, ధనియాల పంటలకు గంధకం కొట్టేవాళ్లం. అప్పుడు పంటలకు మందులు కొట్టేవాళ్లం కాదు. ఇప్పుడైతే ప్రతీ పంటకు మందులు వాడక తప్పడం లేదు.

– శామయ్య, రైతు, మల్లికార్జున్‌పల్లి గ్రామం

పర్యాటక క్షేత్రం.. ప్రకటనలకే పరిమితం

● ఏటా సెప్టెంబరు 17న ప్రజాప్రతినిధుల, రాజకీయ నాయకుల హామీ
● ఆ తర్వాత పట్టించుకోని వైనం
● కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేయాలని గ్రామస్థుల విన్నపం


బైరాన్‌పల్లి గ్రామంలోని బురుజు

ధూళిమిట్ట, జూన్ 23: నిజాం రజాకార్ల ఆగడాలకు ఎదురొడ్డి పోరాడి నిలిచిన గ్రామంగా సిద్దిపేట జిల్లాలోని ధూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి కీర్తి గడించి చరిత్రలో నిలిచింది. గ్రామంలో ఏర్పచుకున్న రక్షక దళాలు బురుజు కేంద్రంగా రజాకార్ల దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టాయి. ఇది తట్టుకోలేని రజాకార్లు ఖాసీం రజ్వీ ఆధ్వర్యంలో 1948 ఆగస్టు 27 బైరాన్‌పల్లి గ్రాంపై మూకుమ్మడి దాడిచేసి.. దొరికిన వారిని దొరికినట్టుగా కాల్చి చంపారు. రజాకార్ల ఆగడాలకు, అన్యాయాలకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో అనేక మంది వీరమరణం పొందారు.

పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేయాలి

రజాకార్ల ఆగడాలకు, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన మా గ్రామ చరిత్రను కాంగ్రెస్ ప్రభుత్వం భావితరాలకు తెలిసేలా పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి. అలాగే గ్రామంలో స్మృతీవనాన్ని ఏర్పాటు చేసి పర్యాటక క్షేత్రంగా చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఏటా సెప్టెంబరు 17న ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు గ్రామంలోని బురుజును సందర్శించి పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని చెబుతున్నారే.. కానీ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెల్లవారేలోపే గ్రామాన్ని రజాకార్లు చుట్టుముట్టారు

1948 ఆగస్టు 27న తెల్లవారేలోపే రజాకార్లు దొంగచాటుగా లారీల్లో తుపాకులతో గ్రామాన్ని చుట్టుముట్టి బురుజు మీద ఉన్న గ్రామ రక్షక దళాల సభ్యులు నిద్రమేల్కొనే లోపే కాల్చిచంపారు. తర్వాత గ్రామంలో దొరికిన వారిని దొరికినట్టుగా 96 మందిని చంపారు. తుపాకుల మోతలతో ప్రజలు భయంతో వణికిపోయారు.

– ఆనాటి స్వాతంత్ర్య సమరయోధుడు చల్ల చంద్రారెడ్డి




మాడాపూర్‌లో ఎత్తైన గుట్టపై దారి కూడా లేనిచోట నిర్మించిన వైకుంఠధామం

రూ.లక్షలు వెచ్చించినా
లక్ష్యానికి దూరం

● తండాకు దూరంగా వైకుంఠధామం

నర్సాపూర్, జూన్ 23: గత ప్రభుత్వం హయాంలో రూ. లక్షలాదిగా నిధులు వెచ్చించి ప్రతీ గ్రామంలో వైకుంఠధామాలు, డంప్ యార్డులు నిర్మించారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ఒత్తిడితో అప్పటి సర్పంచులు పనులు పూర్తి చేసినప్పటికీ చాలాచోట్ల అవి ప్రజలకు ఉపయోగపడటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలకు అనువుగా ఉండే స్థలాన్ని ఎంపిక చేయకపోవడమే అందుకు కారణంగా చెబుతున్నారు. నర్సాపూర్ మండల పరిధిలోని మాడాపూర్ పంచాయతీ పరిధిలో నిర్మించిన వైకుంఠమాన్ని ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. మాడాపూర్ తండాకు కిలోమీటరుకు దూరంగా ఎత్తైన గుట్టపై వైకుంఠధామాన్ని నిర్మించారు. అయితే అక్కడకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేదు. గుట్టపై ఉన్న వైకుంఠధామం వరకు కనీసం రాళ్లురప్పలతో కూడిన కాలిబాట కూడా లేకపోవడం గమనార్హం. దీంతో పాడెపై మృతదేహాన్ని వైకుంఠధామం వరకు తీసుకువెళ్లే పరిస్థితి లేదు. స్థానిక ప్రజలకు అనువైన స్థలంలో లేని కారణంగా అది వినియోగానికి నోచుకోవడం లేదు. ప్రస్తుతం వైకుంఠధామం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి, రాళ్లురప్పల మధ్య వృథాగా మారింది. ఏ లక్ష్యంతో అయితే వాటిని నిర్మించారో ఆ లక్ష్యం నెరవేరకపోగా రూ.లక్షల ప్రజాధనం వృథా చేశారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా దానిని వినియోగంలోకి తెచ్చేలా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు సరైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మాద్వార్ తండాలో తాగునీటి అవస్థలు

నారాయణఖేడ్, జూన్ 23: మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటి సరఫరా కాకపోవడంతో మండల పరిధిలోని మాద్వార్ తండా వాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని నెలలుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని, ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని, దీంతో తాము తాగునీటి కోసం పడరాని పాట్లు పడుతున్నామని తండావాసులు వాపోతున్నారు. నీటి అవసరాలను తీర్చుకోవడానికి గ్రామ శివారులోని బోరుబావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనాఅధికారులు స్పందించి తమకు మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటిని సరఫరా చేసేవిధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఊరూరా వనమహోత్సవానికి ఏర్పాట్లు

● నర్సరీల్లో మొక్కలు సిద్ధం ● గ్రామాల్లో ప్రారంభమైన గుంతల తవ్వకం ● కొల్చారం మండలంలో 3లక్షలకు పైగా మొక్కలు నాటడమే లక్ష్యం


కొల్చారం: రాంపూర్ నర్సరీలో పెరుగుతున్న మొక్కలు


కొల్చారం మండలంలో నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో యాదయ్య(ఫైల్)

కొల్చారం, జూన్ 23: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇప్పటికే ఊరూరా నర్సరీల్లో మొక్కలు పెంచారు. గ్రామ గ్రామాన గుంతలు తవ్వే పనిలో నిమగ్నమయ్యారు. వానలు పడటమే తరువాయి మొక్కలు నాటేందుకు సిద్ధమౌతున్నారు.

మండలంలో లక్ష్యం ఇలా..

కొల్చారం మండల వ్యాప్తంగా 21 గ్రామ పంచాయతీల్లో 2,10,000 మొక్కలు పెంచగా, 49,000 కన్వర్షన్, 56,100 మెయింటెనెన్స్ కోసం మొత్తం 3,15,000 మొక్కలు నాటాలన్నది లక్ష్యంగా నిర్ణయించారు. ఏ గ్రామ నర్సరీల్లో పెంచిన మొక్కలను ఆ ఊరిలోనే నాటాలని అధికారులు నిర్ణయించారు. గతంలో కొన్ని గ్రామాలకు కలిపి ఒక నర్సరీలో మొక్కలను పెంచడంతో ఇతర పల్లెలకు వాటిని తరలించడానికి రవాణా ఖర్చులు పెరిగిపోవడం, ఇతరత్రా ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో ప్రభుత్వం ఊరూరా నర్సరీలను ఏర్పాటు చేసింది. ఆయా గ్రామ పంచాయతీలకే నర్సరీల నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. అవసరం మేరకు పెద్ద పంచాయతీల్లో ఎక్కువగా, చిన్న పంచాయతీల్లో తక్కువగా మొక్కలు పెంచారు.

నర్సరీల్లో పెంచే మొక్కలు ఇవే..

నర్సరీల్లో నీడనిచ్చే మొక్కలు, పూల మొక్కలు, పండ్ల మొక్కలు, రహదారి వెంబడి నాటేందుకు టేకోమా, అడవి తంగేడు వంటి వాటిని సిద్ధం చేస్తుండగా, ప్రతీ ఇంటికి ఆరు మొక్కలు ఇచ్చేందుకు గులాబీ, మందార, ఉసిరి, జామ, దానిమ్మ, నేరెడు పెంచుతున్నారు. జూలై మొదటి వారంలో నిర్వహించే వన మహోత్సవంలో మొక్కలను నాటనున్నారు. అదేవిధంగా హార్టికల్చర్‌లో భాగంగా పండ్ల తోటలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

గుంతలు తవ్విస్తున్నాం



వచ్చే నెల మొదటి వారంలో వానలు కురవగానే మొక్కలు నాటేందుకు గ్రామ గ్రామాన ఉపాధి హామీ పథకం కూలీలచే రోడ్ల పక్కన గుంతలను తవ్విస్తున్నాం. గ్రామ గ్రామాన నర్సరీల్లో మొక్కలు పెంచాం. ఫీల్డు అసిస్టెంట్లు గుంతలను తవ్వించే పనుల్లో ఉన్నారు. వానలు కురవగానే ఇంటింటికి పూల మొక్కలు, పండ్ల మొక్కలు పంపిణీ చేస్తాం. అలాగే రోడ్ల పక్కన, కాలువ గట్లపై, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలను నాటిస్తాం.

- లక్ష్మీనర్సింహులు, కొల్చారం ఎంపీడీవో

ఆగని ఇసుక అక్రమ రవాణా


మూల వాగు వద్ద తవ్విన ఇసుక

నిజాంపేట, జూన్ 23: మండలంలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. కొన్నేళ్లుగా గుట్టుగా కొనసాగిన ఈ దందా ఇటీవల బయటపడినప్పటికీ రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం దృష్టి సారించకపోవడంతో ఇసుక మాఫియా రెచ్చిపోతున్నది. మండల పరిధిలోని కల్వకుంట గ్రామ శివారులో గల మూల వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే ఎక్స్‌కవేటర్ యంత్రాల సహాయంతో అక్రమంగా ఇసుకను తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను తవ్వి ట్రాక్టర్లతో వివిధ ప్రాంతాల్లో ఇసుక డంపులు ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రెండు నెలల క్రితం ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన రెవెన్యూ యంత్రాంగం వెంటనే ఇసుక సీజ్ చేసినా, ఎందుకు వేలం వేయలేదని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు దృష్టికి రాగా తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సురేష్ కుమార్‌కు ఆదేశించారు.


అంబాజీపేటలో బోనాలు ఊరేగిస్తున్న మహిళలు

ఘనంగా బోనాల ఊరేగింపు

చిన్నశంకరంపేట, జూన్ 23: మండలంలోని అంబాజీపేట గ్రామంలోని గ్రామ దేవతల జాతరలో భాగంగా ఆదివారం అమ్మవార్లకు మహిళలు ఘనంగా బోనాలను సమర్పించారు. ఉదయం అమ్మవార్లకు భక్తులు పూజలు చేశారు. సాయంత్రం భైండ్ల డమురుక నాదాలు, పోతురాజుల విన్యాసాలు, డప్పు సన్నాయిల మధ్య బోనాలతో ఊరేగింపు అంగరంగా వైభవంగా కొనసాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

తునికి నల్ల పోచమ్మకు మొక్కులు


అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కౌడిపల్లి, జూన్ 23: మండల పరిధిలోని తునికి నల్ల పోచమ్మ ఆలయానికి ఆదివారం ఉదయం నుంచే భక్తులు పోటెత్తారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకునే క్రమంలో శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. కొంత మంది భక్తులు అమ్మవారికి బోనాలు, డిడి బియ్యం సమర్పించుకున్నారు. ఆషాఢం శోభ మొదలైనట్లుగా పెద్ద సంఖ్యలో బోనాలు సమర్పించారు.

శ్రీలలితాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం


శ్రీలలితాపరమేశ్వరి ఆలయంలో తులాభారం వేస్తున్న భక్తులు

తూప్రాన్, జూన్ 23: తూప్రాన్ పట్టణ పరిధి వెంకటాపూర్ (పీటీ) శివారులో కొలువైన శ్రీలలితా పరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు, దేవీ ఉపాసకులు సోమయాజుల రవీంద్రశర్మ ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి మహాపూజ, చండీయాగం, మహన్యాస పూర్వక శత రుద్రాభిషేకం, అమ్మవారి ఆశీస్సులతో పుట్టిన చిన్నారులకు తులాభారం నిర్వహించారు. యాదగిరిగుట్ట నుంచి విచ్చేసిన సురేష్ బృందం ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

ముగిసిన కన్యకాపరమేశ్వరి వార్షికోత్సవాలు

చేగుంట, జూన్ 23: చేగుంటలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న వాసవి కన్యకాపరమేశ్వరి వార్షికోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మూడురోజుల పాటు అమ్మవారికి నిర్వహించిన కుంకుమార్చన, క్షీరాభిషేకం, పుష్పాభిషేకం, కలశాభిషేకం తదితర కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మండలంలోని ఆర్యవైశ్యులతో పాటు వివిధ గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో మాజీ సర్పంచ్ మంచి కట్ల శ్రీనివాస్,ఆలయ కమిటీ సభ్యులు తొడుపును నగేష్, రాజేశం, బాలేష్, నాగభూషణం, కాసం శంకర్, చందు, మహేష్, రమణ, సురేష్, చంద్రమౌళి, మహిళా సభ్యులు మంజుల, స్వాతి, సౌందర్య, రోజా, సరస్వతి, పాల్గొన్నారు.

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య


సాయికుమార్ (ఫైల్)

చేగుంట, జూన్ 23: మద్యం మత్తులో స్నేహితుడితో గొడవపడిన ఓ యువకుడు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల కేంద్రంలోని ఊర చెరువులో ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన తిరుపతి సాయి కుమార్(21) ఆదివారం తన స్నేహితులతో కలిసి మద్యం సేవిస్తూ అదే మత్తులో స్నేహితుడిపై దాడి చేసి గాయపర్చాడు. అనంతరం భయపడిన సాయికుమార్ పరుగున వెళ్లి స్థానికంగా ఉన్న చెరువులో దూకాడు. ఈ మేరకు చేగుంట ఎస్‌ఐ బాలరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మొగిలి వేణు (ఫైల్)

చేగుంట, జూన్ 23: ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని వడియారంలో ఆదివారం చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. వడియారం గ్రామానికి చెందిన మొగిలి వేణు (25) అనే యువకుడు ఆదివారం ఉదయం పొలం దున్నేందుకు ట్రాక్టర్ తీసుకొని వెళ్లాడు. సాయంత్రం పక్క పొలం వద్ద విద్యుత్ సరి చేసే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. వేణుకు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్‌ఐ బాల్ రాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

అనుమతి లేకుండా ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు

శివ్వంపేట, జూన్ 23: ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో కొందరు మట్టిని తవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ మనోహరాబాద్ మండలం పరికి బండ గ్రామంలోని ప్రభుత్వ భూమి నుంచి ఆదివారం బీఆర్ఎస్ నాయకుల అండతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు నిర్వహిస్తూ వందలాది ట్రాక్టర్ల మట్టిని శివ్వంపేట మండలం గంగయ్యపల్లి శివారులోకి తరలిస్తున్నారని స్థానికులు తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాసాచారిని సంప్రదించగా మట్టి తరలింపు విషయం తన దృష్టికి వచ్చిందని విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


జిన్నారంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నీలం మధు, నాయకులు

జిన్నారం, జూన్ 23: ఇచ్చిన మాట నెరవేర్చుకునే ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు పేర్కొన్నారు. ఆదివారం జిన్నారంలో రుణమాఫీపై క్యాబినెట్ ఆమోదం తెలపడంతో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నీలం మధు, ఎంపీపీ రవీందర్‌గౌడ్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మాణిక్యరావు, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, మహేష్, నీలం లత, కార్యకర్తలు పాల్గొన్నారు.

'నీట్' పరీక్షను రద్దు చేయాలి

● యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ

సంగారెడ్డి రూరల్, జూన్ 23 : నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు గాంధీ భవన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీజేపీ కార్యాలయానికి ర్యాలీగా బయలు దేరారు. ర్యాలీని పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి పట్టణానికి చెందిన యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూన సంతోష్‌కుమార్‌తో పాటు ఇతర నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల జీతాలు సక్రమంగా చెల్లించాలి

టేక్మాల్, జూన్ 23: గ్రామాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచే తమను వేధించడం, జీతాల్లో కోత విధించడం సరికాదని పంచాయతీ కార్మికులు టేక్మాల్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆదివారం నిరసనకు దిగారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ... ప్రతి రోజూ గ్రామాల్లో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహిస్తున్నామని, ఏదైనా అనారోగ్యానికి గురైనప్పుడు విధులకు రాలేకపోతే, దీన్ని సాకుగా చూపి మా జీతాల్లో కోత విధించడం సరికాదంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడు నెలల జీతాలు రావాల్సి ఉంటే కోత విధించి ఐదు నెలల జీతాలు మాత్రమే చెల్లించారని వాపోయారు. తమకు వచ్చే అరకొర వచ్చే జీతాల్లో కోత విధించవద్దని వేడుకున్నారు. కార్మికుల నిరసన సమాచారమందుకున్న స్థానిక నాయకులు గ్రామపంచాయతీకి చేరుకుని కార్మికులతో మాట్లాడారు. అనంతరం నాయకులు పంచాయతీ ఈవోతో చర్చలు జరపగా కోత విధించిన వేతనాన్ని చెల్లించడానికి ఒప్పుకోవడంతో కార్మికులు నిరసన విరమించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమావేశమైన పూర్వవిద్యార్థులు

వెల్దుర్తి, జూన్ 23: మండల పరిధిలోని మంగళపర్తి ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ 1998-99 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు 26 ఏళ్ల సుదీర్ఘ కాలం తరువాత కలుసుకోవడంతో పరస్పర క్షేమ సమాచారం తెలుసుకున్నారు. గత స్మృతులను నెమరువేసుకుని రోజంతా ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం తమ ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

ముస్లాపూర్‌లో..


ముస్లాపూర్‌లో సమావేశమైన పూర్వవిద్యార్థులు

అల్లాదుర్గం, జూన్ 23: అల్లాదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1987-88 ఎస్సెస్సీ విద్యార్థులు ఆదివారం మండలంలోని ముస్లాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుంటూ గత స్మృతులను నెమరువేసుకున్నారు. రోజంతా ఆట పాటలతో సందడి చేశారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్రం

సంగారెడ్డి రూరల్, జూన్ 23 : కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ కార్మికుల పొట్ట కొడుతున్నదని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు విమర్శించారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో వరుణ్ బేవరేజస్ కార్మికులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి రాగానే ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నం ముమ్మరం చేసిందన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ ఇప్పటికే నాలుగు కోడ్‌లను తెచ్చిందని, వెంటనే వాటిని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. జూలై 10న జరిగే దేశవ్యాప్త డిమాండ్స్ డేలో కార్మికవర్గం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని చుక్క రాములు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సాయిలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ యువత నియోజకవర్గ అధ్యక్షుడిగా దత్తు కురుమ


దత్తుకు నియామకం పత్రాన్ని అందిస్తున్న ఆర్ క్రిష్ణయ్య

నారాయణఖేడ్, జూన్ 23: మండలంలోని గంగాపూర్‌కు చెందిన దత్తు కురుమను నారాయణఖేడ్ నియోజకవర్గ బీసీ యువత అధ్యక్షుడిగా నియమిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.క్రిష్ణయ్య ఆదివారం నియామకం ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా దత్తు కురుమను ఆ సంఘం రాష్ట్ర నాయకులు జక్కుల వంశీక్రిష్ణ, నరేష్‌యాదవ్, సిందోల్ దశరత్ అభినందించారు.

తైబజార్ వేలం

కౌడిపల్లి, జూన్ 23: మండల కేంద్రంలోని తై బజార్‌ను గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో శ్రీనివాస్ అధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటేశం తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లడుతూ వేలం పాటలో పాల్గొనేవారు గ్రామపంచాయతీకి ఎలాంటి పన్ను బకాయి ఉండొద్దన్నారు. 10 వేల రూపాయలను డిపాజిట్ చేయాలని తెలిపారు.

6, 7 తేదీల్లో పీడీఎస్‌యూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

సంగారెడ్డి అర్బన్, జూన్ 23 : పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలు వచ్చే నెల 6, 7 వ తేదీల్లో సంగారెడ్డిలోని టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించనున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందన్నారు. గత పదేళ్ల కాలంలో కేసీఆర్ సర్కారు ప్రధానంగా విద్యారంగాన్ని కోలుకోలేని విధంగా ధ్వంసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా నూతన ప్రభుత్వం వెంటనే దృష్టి సారించాలన్నారు. భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణను పీడీఎస్‌యూ జనరల్ కౌన్సిల్ ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్, నాయకులు మనోహర్, శ్రీధర్, అరుణ్, సాయి, రఘు, రిహాన్, శివ తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ నిర్ణయాలతో ఎస్జీటీలకు తీవ్ర నష్టం

● ఎస్జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎస్జీటీయూ నాయకులు

వెల్దుర్తి, జూన్ 23: గత ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాల వల్ల ఎస్జీటీయూ ఉపాధ్యాయులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం పేర్కొన్నారు. ఎస్జీటీయూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఆదివారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డితో కలిసి వెంకటేశం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ.. అర్హతలు మరియు సీనియారిటీ ఉన్న ఎస్జీటీయూ ఉపాధ్యాయులు తీవ్ర నిరాశలో ఉన్నారని, ఎస్జీటీయూ ఉపాధ్యాయులను కాదని అర్హతలు లేని సినియారిటీ లేని ఉపాధ్యాయులతో పండిట్‌లకు అప్‌గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినట్టు తెలిపారు. గత ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం వల్ల ఎస్జీటీలకు తీవ్ర నష్టం జరిగిందని, ఎమ్మెల్సీలకు మద్దతు తెలిపినా ఎస్జీటీ ఉపాధ్యాయులకు అన్యాయం చేసిందన్నారు. ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీలో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించాలని లేదా 300 మందితో వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్టు తెలిపారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత

● జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, రాధాగోవింద రథయాత్రలో పాల్గొన్న భక్తులు

జహీరాబాద్, జూన్ 22: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. హరేరామ, హరేక్రిష్ణ సంస్థాన్‌వారి ఆధ్వర్యంలో ఆదివారం జహీరాబాద్ పట్టణంలో రాధాగోవింద రథయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. హరేరామ, హరేక్రిష్ణ సంస్థాన్ వారు జహీరాబాద్ పట్టణంలో రథయాత్ర చేపట్టడం వల్ల స్థానికుల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందుతుందన్నారు.కార్యక్రమంలో నాయకులు, ఉత్సవకమిటీ సభ్యు లు, ప్రజలు పాల్గొన్నారు. కాగా సంస్థాన్‌వారి ఆధ్వర్యంలో ఆదివారం జహీరాబాద్ పట్టణంలో రాధాగోవింద రథయాత్ర కార్యక్రమం ఉత్సాహ భరితంగా కొనసాగింది. రథయాత్రలో మహిళలు, పురుషులు పెద్దసంఖ్యలో పాల్గొని హరినామ సంకీర్తన, చేశారు. రథయాత్ర శివాజీ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు సాగింది.

శ్రీవైష్ణవ విద్యార్థుల ప్రతిభా పురస్కారాలకు ఆహ్వానం

సంగారెడ్డి అర్బన్, జూన్ 23: తెలంగాణ శ్రీవైష్ణవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఇటీవల పది, ఇంటర్ వార్షిక పరీక్షల ఫలితాల్లో అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థుల ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు కందాడై వరదాచార్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం రజతోత్సవాల సందర్భంగా ప్రతిభా పురస్కారాలతో పాటు పారితోషికాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల పూర్తి వివరాలతో పాటు మార్కుల మెమో జత చేయాలన్నారు. 8 వ తరగతి నుంచి పై చదువులు చదివే పేద శ్రీవైష్ణవ విద్యార్థులకు ఆర్థిక పారితోషికం ఇస్తామన్నారు. వారు తమ పూర్తి వివరాలతో పాటు ఆదాయ ధ్రువీకరణ, బోనఫైడ్ సర్టిఫికెట్ జత చేసి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 30 లోగా స్వయంగాగానీ, పోస్టు ద్వారా గానీ అధ్యక్షుడు, శ్రీవైష్ణవ సేవా సంఘం, తెలంగాణ శ్రీ వైష్ణవ సదనం, రోడ్ నెం.5, చంద్రపురి కాలనీ, ఎల్‌బీనగర్, హైదరాబాద్, 500074 చిరునామాకు సమర్పించాలని ఆయన కోరారు.

శ్యామప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి


మెదక్‌లో శ్యామప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు


బీజేపీ సంగారెడ్డి జిల్లా కార్యాలయంలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గోదావరి


సంగారెడ్డి పాత బస్టాండ్ వద్ద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


జహీరాబాద్‌లో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 23 : అఖండ భారతావని కోసం శ్యామప్రసాద్ ముఖర్జీ ప్రాణత్యాగం చేశారని బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి కొనియాడారు. సంగారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు శ్యామప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోదావరిఅంజిరెడ్డి మాట్లాడుతూ శ్యామప్రసాద్ ముఖర్జీ సేవలు నేటి యువతకు ఆదర్శమని తెలిపారు. సంగారెడ్డి పాత బస్టాండ్ వద్ద పట్టణ శాఖ ఆధ్వర్యంలో బలిదాన్ దివస్‌ను నిర్వహించి శ్యామప్రసాద్ ముఖర్జీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి అదెల్లి రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, మాణిక్‌రావు, అధికార ప్రతినిధి డా.రాజుగౌడ్, కార్యదర్శి నాగరాజు,కార్యాలయ కార్యదర్శి విజయ్, పట్టణ అధ్యక్షుడు ద్వారక రవి, నరేన్‌దేశ్‌పాండే, అశ్వంత్, మీనా పాల్గొన్నారు.

● **జహీరాబాద్:** బీజేపీ ఆవిర్భావానికి, హిందువుల అభ్యున్నతికి కృషిచేసిన గొప్ప మహనీయుడు డా. శ్యామప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ నాయకులు కొనియాడారు. జహీరాబాద్‌లో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా శ్యామప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్ జగన్, బీజేపీ నాయకులు విజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సుధీర్ బండారీ, విశ్వనాథ్, బక్కయ్యగుప్తా సంతోష్, రాఘవేందర్‌నాయక్, పూల సంతోష్, శ్రీధర్, చెన్నబసవ పాల్గొన్నారు.

● **మెదక్ అర్బన్:** దేశం కోసం శ్యామప్రసాద్ ముఖర్జీ చేసిన త్యాగం మరువలేనిదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో శ్యామప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బలిదాన్ దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **పెద్దశంకరంపేట:** మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శ్యామప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్, నాయకులు శ్రావణ్‌కుమార్, విజయ్‌కుమార్, అనిల్ పాల్గొన్నారు.

● **రామాయంపేట:** బలిదాన్ దివస్‌ను పురస్కరించుకుని పట్టణంలో బీజేపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మెదక్ చౌరస్తాలో శ్యామప్రసాద్ ముఖర్జీ చిత్రపటాన్ని ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ నేత వెల్మల సిద్రాములు, నాయకులు చింతల శేఖర్, దోమకొండ శ్రీను, బాను, అవినాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.